క్లుప్తంగా

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మోహన్‌రావు

మాకవరపాలెం: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహద పడతాయని ప్రిన్సిపాల్ మోహన్‌రావు అన్నారు. హాకీ ప్లేయర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా మంగళవారం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు, బాక్సింగ్ కోచ్ సన్యాసిరావు, క్రీడాకారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్ల బిల్లుల జాప్యంపై విచారణ



విచారణ చేపడుతున్న త్రిసభ్య కమిటీ సభ్యులు నాగలక్ష్మి, రోజారమణి

మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టరు నియమించిన త్రిసభ్య కమిటీ మంగళవారం మినీ గోకులం షెడ్ల బిల్లుల జాప్యంపై విచారణ చేపట్టింది. మాడుగుల, చీడికాడ, రోలుగుంట మండలాలకు సంబంధించి బిల్లులు అందని లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించింది. నివేదిక కలెక్టరుకు అందజేస్తామని కమిటీ తెలిపింది. డీపీఆర్సీ ఏపీవో ఇ.నాగలక్ష్మి, డ్వామా అడిషనల్ పీడీ ఎం. రోజారమణి, డీఏహెచ్‌వో బి.ప్రసాద్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి వైదేహి, సిబ్బంది

కె.కోటపాడు: వ్యక్తి మరణించిన ఆరు గంటల లోపు నేత్రదానం చేయడం వల్ల మరొకరి జీవితంలో వెలుగులు నింపినవారు అవుతారని ఆప్తాలమిక్ అధికారి జి.వి.వైదేహి తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో ఆమె కరపత్రాలను విడుదల చేశారు. ప్రజలకు నేత్ర సంరక్షణపై అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు కార్య క్రమం ద్వారా లక్షలాది మందికి కంటి పరీక్షలు చేసి కంటి చూపును కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు రమ, హెడ్ నర్సు పద్మావతి, ఆర్థోపెడిక్ అసిస్టెంట్స్ ఎం.నవీన, ఎస్.మాధవి, సురేష్ పాల్గొన్నారు.

కుళాయి పనులకు భూమిపూజ

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం శివారు లక్ష్మీపురంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటా కుళాయి కనెక్షన్ కింద పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. రూ.25 లక్షలతో ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ సచివాలయ కన్వీనర్ బోగాది జోగారావు, పాల సొసైటీ మాజీ అధ్యక్షుడు కోన శ్రీను, నాయకుడు కామరాజు పాల్గొన్నారు.

రైతులు లేని 'తాచేరు' నిరసన యాత్ర

- టీడీపీ కార్యకర్తల నుంచే స్పందన కరువు

మాడుగుల రూరల్: తాచేరు రిజర్వాయర్ పూర్తి చేయాలంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చేపట్టిన పాదయాత్రకు స్పందన కరువైంది. వీరవిల్లి నుంచి ఎం. కోటపాడు మీదుగా ఘాట్‌రోడ్ జంక్షన్ వరకు కొనసాగిన ఈ పాదయాత్రకు కార్యకర్తలతోపాటు ఆయకట్టు రైతులు అరకొరగా హాజరయ్యారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, నియోజకవర్గ నాయకుడు పైలా ప్రసాదరావులతోపాటు మరి కొంత మంది ముఖ్య కార్యకర్తలు గైర్హాజరవడంతో ఆ పార్టీ వర్గపోరు మరోమారు బహిర్గతమైంది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడంతో కొంతమంది సొంత పార్టీ కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.



నర్సీపట్నం: గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి, పాఠకులు



రోలుగుంట: కొవ్వూరులో బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు



బుచ్చెయ్యపేట: ఐయితంపూడిలో వేడుకలు

తెలుగు భాష.. మనందరి శ్వాస

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- గిడుగు వెంకట రామ్మూర్తి పంతులుకు ఘన నివాళి



కె.కోటపాడు: కేజీబీవీలో గిడుగు చిత్రపటానికి పూలమాల వేసిన ప్రిన్సిపాల్ చిన్నమ్మలు



దేవరాపల్లి హైస్కూల్‌లో వేషధారణల విద్యార్థులతో జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంఈవో-1 పడాల్‌దాస్



రావికమతం: కొత్తకోట హైస్కూల్‌లో బహుమతులందిస్తున్న దృశ్యం

దేవరాపల్లి: అమృతం లాంటి తెలుగు భాషను మరువొద్దని, తెలుగు భాషపై విద్యార్థులు మరింత పట్టు సాధించాలని స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి, జాతీయ హాకీ క్రీడా పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి వేషధారణలతో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హెచ్ఎం, ఇన్‌చార్జి ఎంఈవో-1 బి. పడాల్‌దాస్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొరుపోలు స్వామినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎ. కొత్తపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం వై. స్వర్ణలత ఆధ్వర్యంలో జాతీయ తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకొని గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి హెచ్‌ఎం వరప్రసాద్, తెలుగు టీచర్లు పద్మాల విజయలక్ష్మి, చదలవాడ సునీత, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనిలో భాగంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, తెలుగుతల్లిని కీర్తించే గీతాలు, రామాయణ పురాణ గాథలతో కూడినటువంటి ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కుసుర్లపూడిలో ఇన్‌చార్జి హెచ్ఎం బి.విద్యావతి, కొవ్వూరులో దేముడు మాస్టారు, కొమరవోలు, కొంతలం శరభవరం తదితర పాఠశాలల్లో ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి దమయంతి, జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయిని శ్యామలాదేవి గిడుగు రామూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష గొప్పదనాన్ని కొనియాడారు. గ్రాంధిక భాష నుంచి వ్యవహారిక భాష కోసం గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను కొనియాడారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి జి.మురళీకృష్ణ, ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు, పాఠకులు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో కొత్తకోట, టి.అర్జాపురం హైస్కూళ్లలో తెలుగుతల్లి, గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. కొత్తకోటలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. గతేడాది పదో తరగతి తెలుగులో ప్రతిభ కనబర్చిన 20 మంది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబ్‌గా వ్యవహరించిన వారికి ప్రోత్సాహకాలు అందించి సత్కరించారు. హెచ్ఎం కె.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. టి.అర్జాపురం హైస్కూల్‌లో తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థిని ఆకట్టుకుంది. హెచ్ఎం సీహెచ్ మల్లునాయుడు, సీఆర్పీ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఆధునిక భాషా వేత్తలలో అగ్రగణ్యుడు గిడుగు వెంకటరామ్మూర్తి అని ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు తెలిపారు. కింతాడ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం గిడుగు చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. చౌడువాడ పాఠశాలలో హెచ్‌ఎం దీవి అప్పలకొండ(దత్తు), కొరువాడ హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం సుగుణ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కొరువాడ హైస్కూల్‌లో పీడీ దేముళ్లు ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు.

బుచ్చెయ్యపేట: మండలంలో తెలుగుభాష దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు భాష పితామహుడు గిడుగు వెంకటరామూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. తెలుగుభాష ఔన్నత్యం గురించి, ఆధునిక కవుల భాషా ప్రావీణ్యం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

చోడవరం రూరల్: మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలను ఆవిష్కరించి, పూలమాలలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. గవరవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జి.జె.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇక్కడ లక్కవరం యూనియన్ బ్యాంకు మేనేజర్ ఆకాష్ పాల్గొని విద్యార్థులకు హితవచనాలు పలికారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గిడుగు, ధ్యాన్‌చంద్ వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అద్దూరు పాఠశాలలో అల్లూరి, అన్నమాచార్య, లవకుశ వేషధారణలు, ఏకపాత్రాభినయాలతో అలరించారు. స్థానిక ఆర్క్ కార్యాలయంలో ఫోరం ఫర్ బెటర్ చోడవరం సంస్థ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తికి ఘన నివాళులర్పించారు. ఏయు విశ్రాంత ఆచార్యులు మోపిదేవి విజయగోపాల్, రిటైర్డ్ ఆర్జేడీ తిరుపతిరావు, ఆర్క్ ప్రసాద్ పాల్గొన్నారు.

నాతవరం: ఎం.బి.పట్నం హైస్కూల్‌లో గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి హెచ్ ఎం ఎస్.సిహెచ్.పాత్రుడు ఘన నివాళులర్పించారు. ఆటలు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



స్పోర్ట్స్ డే పేరిట అక్షర రూపంలో నిల్చొన్న విద్యార్థినులు



నాతవరం: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం పాత్రుడు



చోడవరం రూరల్: క్రీడాపోటీల విజేతలకు బహుమతుల అందచేత



చోడవరం రూరల్: అల్లూరి, అన్నమయ్య, తెలుగుతల్లి వేషధారణలో చిన్నారులు

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గృహసారథుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న మండల నాయకులు

గొలుగొండ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం గృహసారథులు, కన్వీనర్లు కష్టపడి పనిచేయాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. పప్పుశెట్టిపాలెంలో మంగళవారం గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. వీరి నుంచి బీమా దరఖాస్తులు, పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చారన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ పాలన కోసం దుష్ట శక్తులు పనిచేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు కొరుప్రోలు పాణీశాంతారామ్, సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ పూజలు



మంగళగౌరీ పూజలు చేస్తున్న భక్తులు

గొలుగొండ: కృష్ణదేవిపేటలోని సత్యసాయిబాబు ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం పెద్ద ఎత్తున భక్తులు మంగళగౌరీ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణదేవిపేట, ఏఎల్‌పురం, కొంకసింగి, నాగాపురం తదితర ప్రాంతాల నుంచి మహిళలు పాల్గొన్నారు. శ్రావణమాసంలో మంగళగౌరీ పూజా కార్యక్రమాలు చేయడం వల్ల ఇంట్లో సకల సంతోషాలు ఉంటాయని వేదపండితులు తెలిపారు.

'ఫ్లోరైడ్ గ్రామాల్లో తాగునీటి సమస్య'

రోలుగుంట: మండలంలోని ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు కోరారు. మంగళవారం రోలుగుంటలో ఆయన మాట్లాడుతూ ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు జానకీరాంపురం ఏటి నుంచి పంపింగ్ సిస్టం ద్వారా తాగు నీరు సరఫరా అవుతుందన్నారు. ఒక పక్క ఇసుక తవ్వకాలతో కలుషితం చేయడంతో నీటి నిల్వలు అడుగంటిపోయి బాధిత గ్రామాలకు తరచూ తాగు నీటి సమస్య ఏర్పడుతుందని ఆరోపించారు.

సర్వేల నిర్వహణలో నాతవరం వెనుకంజ

జిల్లా సచివాలయాల ఇన్‌చార్జి, డీఎల్‌డీవో మంజులావాణి



మర్రిపాలెం సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎల్‌డీవో మంజులావాణి

నాతవరం: జిల్లాలో మిగతా మండలాలతో పోల్చుకుంటే నాతవరం మండలం పలు సర్వేల నిర్వహణల్లో వెనుకంజలో ఉందని జిల్లా సచివాలయాల ఇన్‌చార్జి, డీఎల్‌డీవో ఎస్.మంజులవాణి తెలిపారు. ఆమె మంగళవారం మర్రిపాలెం, ఎం.బి.పట్నం, గన్నవరం గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జగనన్న పాలవెల్లువ, ఇళ్ల సర్వే వేగవంతం చేయాలన్నారు. సచివాలయ, మండల స్థాయి అధికారులు సంయుక్తంగా పని చేసి మండలాన్ని ముందంజలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లోనూ మండలం వెనుకబడి ఉందని, వాటిని వేగవంతం చేసేందుకు దృష్టి సారించాలన్నారు. సర్వేల విషయంలో నిర్లక్ష్యం చేసే సచివాలయ ఉద్యోగుల జాబితా తనకు ఇస్తే కలెక్టరు దృష్టిలో పెడతానన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమై అభివృద్ధి పనులపై చర్చించారు. నర్సీపట్నం డివిజన్ డీఎల్‌డీవో ఉదయశ్రీ, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో హనుమంతరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, జేఈ జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశీయ పశువుల పెంపకం లాభదాయకం



పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారులు

మాడుగుల: పొంగలిపాకలో మంగళవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. కింతలి వల్లాపురం పశువైద్యశాల పరిధి కింతలి, జాలంపల్లి, ఎల్.పొన్నవోలు, కింతలి వల్లాపురం పంచాయతీల నుంచి 50 దేశీయ జాతితోపాటు హెచ్ఎఫ్, జెర్సీ జాతి లేగదూడలు పాల్గొనగా, ఉత్తమ జాతి లేగదూడలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. పాడి రైతులు పచ్చికూర పరదేశినాయుడు, కర్రి శ్రీను, పొన్నాడ రామారావు, వెల్లంకి నానాజీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పశుగాణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామమోహనరావు మాట్లాడుతూ దేశీయ జాతుల పెంపకం లాభదాయకమని, వీటి పాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. లీటరుకు రూ.200లకు పైగా ఉందన్నారు. లింగ నిర్ధారిత వీర్య పథకం ద్వారా గ్రామానికి చెందిన రైతు దామరౌతు స్వామినాయుడుకు చెందిన జెర్సీ ఆవుకు ఆరోగ్యమైన పెయ్యి పుట్టిందన్నారు. ఏడీ వి. చిట్టినాయుడు, వార్డు మెంబరు నాయిన సత్యనారాయణ, ఎంపీటీసీ మైచర్ల సన్యాసినాయుడు, పశువైద్యాధికారులు నరేష్, మణిలక్ష్మణ్, అరుణ కిరణ్, గణేష్ పాల్గొన్నారు.

ఇసుకపై టీడీపీవి అసత్య ఆరోపణలు

దమ్ముంటే నిరూపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్



మాట్లాడుతున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జెడ్పీటీసీ కర్రి సత్యం, బాబూరావు

దేవరాపల్లి: ఇసుక వ్యవహారంపై టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు అన్నారు. మంగళవారం స్థానిక రైవాడ జలాశయం అతిథి గృహం ఆవరణలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇక్కడ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడిపై బురద జల్లడానికి ఇతర జిల్లాలకు చెందిన నేతలను రప్పించి చేపట్టిన నిరసనకు సొంత పార్టీ శ్రేణులు రాకపోవడంతో భంగపాటుకు గురయ్యారన్నారు. జీవో నంబర్ 32కు లోబడి అధికారుల అనుమతితో అభివృద్ధి పనులు, జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి తరలిస్తున్నామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కడైనా ఇసుక తరలించినట్లు దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. బోయిలకింతాడ – కాశీపురం రోడ్డు అభివృద్ధి పనులకు సదరు కాంట్రాక్టర్ రోడ్డు పక్కన నిల్వ చేసుకున్న ఇసుక కుప్పలను అక్రమ రవాణాగా చిత్రీకరించడం టీడీపీ నీతి మాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, దేవరాపల్లి, కలిగొట్ల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు దాసరి గోపి, చింతు రాము, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు చల్లా నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటకు కొత్తగా 175 పింఛన్లు మంజూరు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



బుచ్చెయ్యపేట సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: మండలానికి కొత్తగా 175 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, వచ్చే నెల ఒకటో తేదీ నుంచి వీటిని పంపిణీ చేస్తామని ఇంకా అర్హత ఉన్న వారికి అక్టోబర్‌లో పింఛన్ సొమ్ము అందిస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్త పింఛనుదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎవరైనా పింఛన్‌దారుడు చనిపోతేనే మరొకరికి ఆ పింఛన్ మంజూరు చేసేవారన్నారు. అప్పట్లో వేలాది మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే, అర్హత ఉన్నా అందించేవారు కాదని, జన్మభూమి కమిటీల సంతకాలు పేరుతో కొర్రీలు పెట్టేవారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పార్టీలు, కులమతాలు చూడకుండా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ ఏ తేదీన ఇచ్చేవారో, ఎప్పుడు ఇచ్చేవారో తెలిసేది కాదని, పింఛన్ పొందడానికి పంచాయతీ కార్యాలయాల వద్ద ఆకలితో అలమటించేవారని వాపోయారు. జగనన్న వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చి ఒకటో తేదీనే అవ్వాతాతల ఇంటికెళ్లి తలుపుతట్టి రూపాయి కూడా అవినీతి లేకుండా నేరుగా పింఛన్ నగదు అందిస్తున్నారన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కరోనా కష్టకాలంలోనూ అభివృద్ధిని, సంక్షేమాన్ని సమర్థవంతంగా నడిపించి దేశంలోనే నంబరువన్ ముఖ్యమంత్రిగా పేరొందారన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న సచివాలయం, వలంటీరు వ్యవస్థ, నాడు- నేడు, ఆరోగ్యశ్రీ, అమ్మఒడి, రైతు భరోసా తదితర పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచాయన్నారు. మండలంలో పలు గ్రామాల్లో నిర్మిస్తున్న రోడ్డు పనులను మూణ్నెల్లలో పూర్తి చేసి అన్ని గ్రామాలకు రవాణా సదుపాయం కల్పిస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆపరేటివ్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, పెదిరెడ్ల మాణిక్యం, గోకివాడ వరకృష్ణ, బర్ల శివ, గొల్లవిల్లి సత్యనారాయణ, జోగా కొండబాబు, రాజాన కొండనాయుడు, ఆది సత్యనారాయణ, కోరుకొండ రమణ, భూషణం, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు పాల్గొన్నారు.

చోడవరానికి కొత్తగా 365 పింఛన్ల మంజూరు



చోడవరం సమావేశంలో కొత్త పింఛన్ దారులు

చోడవరం: అభాగ్యులకు అండగా ఉండటమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలానికి కొత్తగా 365 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. నూతన లబ్ధిదారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటికే చోడవరం మండలంలో 12 వేల మందికి వివిధ రకాల పింఛన్లు ప్రభుత్వం అందిస్తున్నామన్నారు. ఇంకా అర్హులుంటే వారికి పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. పింఛన్ల కోసం దరఖాస్తులు పట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరిగే రోజులు పోయి నేరుగా ఇంటికే వచ్చే రోజులను జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో చైతన్య, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల సచివాలయాల కన్వీనర్ పతివాడ అప్పారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గ శ్యామల పాల్గొన్నారు.

నేడు సంతోషిమాతకు పూజలు

మాడుగుల రూరల్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారి జన్మదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆలయంలో మాలధారణ భక్తులు, ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో ఈ పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

జోరుగా రాఖీల విక్రయాలు

మాడుగుల: రాఖీ పండగ సందర్భంగా మాడుగుల, ఘాట్‌రోడ్ జంక్షన్‌లో రాఖీలు జోరుగా విక్రయిస్తున్నారు. వివిధ ఆకృతులతో ఆకర్షణీయమైన రాఖీలు ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.200 అమ్ముడుపోతున్నాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు తమ అనురాగాన్ని పంచుకోవడానికి వీటిని కొనుగోలు చేస్తున్నారు.



ఘాట్‌రోడ్ జంక్షన్‌లో విక్రయానికి సిద్ధం చేసిన రాఖీలు

నూతన పాల సంఘం అధ్యక్షుడికి అభినందన



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: అడవుల అగ్రహారం విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన పడాల శ్రీనివాసును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం తారువ క్యాంపు కార్యాలయంలో దుశ్శాలువాతో సత్కరించారు. మంగళవారం ఉదయం తనను మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన్ను అభినందించి పాడి రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, సర్పంచ్ సలాది గంగేషు, నాయకులు గంటా మత్స్యరాజు, సలాది సన్యాసినాయుడు పాల్గొన్నారు.